సాక్షి
బాపట్ల
శుక్రవారం । 26 । మే । 2023



**నిమ్మకాయల ధరలు**
తెనాలి టౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ. 1,300, గరిష్ట ధర రూ. 2500, మోడల్ ధర రూ. 1800 వరకు పలికింది.



**సాగర్ నీటిమట్టం**
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.70 అడుగుల వద్ద ఉంది.

**నాగార్జునకొండకు తెలంగాణ హైకోర్టు జడ్జి**



విజయపురిసౌత్: పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ ప్రియదర్శిని గురువారం కుటుంబ సమేతంగా సందర్శించారు.

## న్యూస్‌రీల్

### పటిష్ట బందోబస్తు



**తాడికొండ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్ రాజ్ తెలిపారు. సీఎం పర్యటనను పురస్కరించుకొని గురువారం వెంకటపాలెంలో సభ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల రాకపోకల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వీఐపీల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సభా వేదిక, ట్రాఫిక్ నియంత్రణ, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, పల్నాడు ఎస్పీ, రవి శంకర్ రెడ్డి, ఎస్పీలు, రవీంద్ర బాబు, విశాల్ గున్నీ, పలువురు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

### ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రం

**జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి**



**నరసరావుపేట:** పల్నాడు జిల్లాలో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 538 సచివాలయాలకు 107 సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ వద్ద నాల్గో విడత 45 ఆధార్ కేంద్రాల పరికరాలను గురువారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడతలో 18, రెండో విడతలో 29, మూడో విడతలో 15 ఆధార్ కేంద్రాల పరికరాలను పంపిణీ చేశామన్నారు. జీరో టు ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కేంద్రాలలో వివరాలను నమోదు చేసి కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సచివాలయాల పరిధిలో ఆధార్ వివరాల అప్‌డేట్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పదేళ్ల కిందట ఆధార్ కార్డులు పొందినవారు, తప్పనిసరిగా వారి కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆధార్ కార్డును అప్ డేట్ చేసుకోకుంటే, అవి రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు.

### దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు వివిధ రూపాలలో విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన భరత్ మద్దినేని, సేవిత కుటుంబ సభ్యులు, విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన నర్రా మల్లేశ్వరరావు, శ్రవణ్ కృష్ణ ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి ఒక్కొక్కరు రూ.1,00,116లను విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందజేశారు.

### 28న విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రదానం

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. ఆ రోజు కార్యక్రమంలో విశ్వకర్మ లెజండరీ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ పంచకర్మలు, సాహిత్య, సాంస్కృతిక, వేద విద్య, వైదిక ఆగమ శాస్త్రాల్లో నిష్ణాతులైన విశ్వకర్మలకు అవార్డులను అందజేస్తామని పేర్కొన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తేంద్ర పారంపర్య పీఠాధిపతులు, నందికొండ సంస్థానాధీసులు శ్రీకాంతేంద్ర స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, మహిళా నాయకురాలు రామోజు మల్లీశ్వరి, కోసూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

# ఈకేవైసీ ఐతేనే పీఎం కిసాన్

- కేంద్రం కొత్త నిబంధనలు
- ఈనెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు
- ఇప్పటివరకు జిల్లాలో 86 శాతం పూర్తి
- మిగిలిన 14 శాతం సంపూర్తికి కసరత్తు

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** ఈనెల 30వ తేదిలోగా జిల్లాలోని రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ ద్వారా నగదు ఖాతాల్లో జమవుతుందని తెలిపింది. జిల్లా వ్యవసాయాధికారులు ఇప్పటికే ఈకేవైసీ పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో రైతు భరోసా, పీఎం కిసాన్ మొత్తాలను జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మే 30లోపు రైతులు తమ సాగు భూములను ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈకేవైసీ పూర్తిచేయని రైతులకు పీఎం కిసాన్ మొత్తాన్ని జమచేసేది లేదని ఇప్పటికే వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఏడాదికి మూడు సార్లు చొప్పున మొత్తం 13 విడతల్లో పీఎం కిసాన్ ద్వారా నగదు జమచేసింది. తాజాగా 14వ విడత మొత్తాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా జమచేయనున్నారు. గతంలో ఈకేవైసీ నిబంధన లేదు. ఈసారి ఈ నిబంధనను తప్పనిసరి చేశారు.



ఈకేవైసీ చేయిస్తున్న వ్యవసాయాధికారులు

జిల్లాలో 25 మండలాల పరిధిలో 1,53,536 మంది రైతులు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 1,32,070 (86 శాతం) రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 21,466 (14శాతం) మంది చేయించుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు చెరుకుపల్లి మండలంలో అత్యధికంగా 95 శాతం మంది, సంతమాగులూరులో 92 శాతం, పిట్టలవానిపాలెంలో 91 శాతం మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. రేపల్లె మండలంలో కేవలం 79 శాతం మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. జే పంగులూరు, కొల్లూరు, బాపట్ల, భట్టిప్రోలు, నిజాంపట్నం, కారంచేడు, బల్లికురవ, చీరాల, చుండూరు, వేటపాలెం, అమృతలూరు, చినగంజాం, కొరిశపాడు, మార్టూరు, నగరం, అద్దంకి, కర్లపాలెం, పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, వేమూరు మండలాల్లో 80 నుంచి 89 శాతం మంది వరకు రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. జిల్లాలో ఇంకా 14 శాతం మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

**ఈకేవైసీ ఇలా..**

భూముల వివరాలను స్థానిక సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేయించి ఈకేవైసీ చేయించుకోవచ్చు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లలేనివారు సమీపంలోని మీసేవా, ఇంటర్నెట్ కేంద్రాల్లోనూ వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తిచేయించుకోవచ్చు. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ అయిన వారు ఓటీపీ విధానం ద్వారా స్థానిక సచివాలయం, రైతుభరోసా కేంద్రాలకు వెళ్లకుండానే ఈకేవైసీ చేయించుకోవచ్చు. ఇటీవల ఫేషియల్ సిస్టమ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వేలి ముద్రతో పనిలేకుండా మీసేవా, ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్ళి ముఖం చూపించి సదరు రైతు తమ భూములను ఈకేవైసీ చేయించుకోవచ్చు.

**రైతులు వెంటనే స్పందించాలి**



రైతులు ఈకేవైసీ చేయిస్తేనే పీఎం కిసాన్ నగదు వారి ఖాతాల్లో జమవుతుంది. ఈ నెలాఖరులోపు రైతులు స్పందించాలి. లేకుంటే నష్టపోతారు. వెంటనే ఈకేవైసీ పూర్తిచేయించుకోవాలి.

– అబ్దుల్ సత్తార్, జేడీఏ



చీరాల-ఒంగోలు రహదారిపై పడిన తాటిచెట్లు

# ఈదురుగాలుల బీభత్సం

- కూలిన కరెంటు స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చీరాల /అద్దంకి/భట్టిప్రోలు:** చీరాల నియోజకవర్గంలో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి ఎండవేడిమి అల్లాడించింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలపాటు వీచిన గాలులకు చీరాల మండలంలోని జాండ్రపేట, వేటపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, రోడ్డు పక్కనున్న తాడిచెట్లు కూలిపోయాయి. తాడిచెట్లు కరెంట్ తీగలపై పడటంతో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చీరాల-ఒంగోలు రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి గమనించి అధికారులతో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్డుపై ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, అద్దంకి మండలాల్లో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వాన కురిసింది. సంతమాగులూరులో రోడ్డు పక్కనే ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.
- భట్టిప్రోలు మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులు వీచాయి. వడగళ్లవాన పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వడగళ్ల వానకు రహదారులు జలమయమయ్యాయి.



సంతమాగులూరులో రోడ్డుపై పడిన చెట్లు

# నేడు పంగులూరుకు క్రీడాశాఖ మంత్రి రోజా



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

**జే.పంగులూరు:** పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణానికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం రానున్నట్లు ఏపీ శాప్ నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3వ జాతీయ క్రీడలకు ఎంపికైన రాష్ట్ర పురుషుల జట్టు కోచింగ్ క్యాంపును ప్రారంభించేందుకు రోజా వస్తున్నట్టు వివరించారు. ఈ కోచింగ్ క్యాంపును రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య కూడా పాల్గొనున్నట్లు వివరించారు. అనంతరం క్రీడా ప్రాంగణాన్ని కృష్ణచైతన్య పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యర్రం శ్రీనివాస రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆర్.వెంకట సుబ్బారావు, శాప్ అధికారి వెంకటేశ్వర్లు, బాపట్ల, పల్నాడు సీఈఓ పల్లవి, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

# పల్లెకోనలో నాటక సంరంభం

- 28 నుంచి పరుచూరి రఘుబాబు స్మారక అఖిలభారతస్థాయి పోటీలు
- నాలుగురోజులపాటు కళాభిమానులకు కనువిందే
- చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

**పల్లెకోన (భట్టిప్రోలు) :** నాటక సంరంభానికి పల్లెకోన సిద్ధమవుతోంది. పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ డి.రామానాయుడు 31వ అఖిల భారతస్థాయి ఆహ్వాన నాటక పోటీలకు నందమూరి తారక రామారావు ప్రాంగణం ముస్తాబవుతోంది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు కళాభిమానులకు కనువిందు చేయనున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రదర్శించే నాటకాల వివరాలను నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు గురువారం ప్రకటించారు. 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉత్సవాల ప్రారంభోత్సవం జరుగుతుందని వివరించారు. నాలుగు రోజులపాటు మొత్తం ఆరు నాటకాలను ప్రదర్శించనున్నట్టు వెల్లడించారు.

**ప్రదర్శనలిలా..**

- తొలి రోజు సాయంత్రం 6:30 గంటలకు శ్రీ కళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ''ఎర్ర కలువ '' నాటకం ప్రదర్శితమవుతుంది. రచన భాస్కర్ చంద్ర, దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ.
- 29వ తేదీ రాత్రి 6:30 గంటలకు మిత్రా క్రియేషన్స్ నరసరావుపేట ఆధ్వర్యంలో ''ది ఇంపోస్టర్ '' (అంతా నిజమే చెబుతారు) ప్రదర్శితం కానుంది.
- 29న రాత్రి 8:30 గంటలకు కళా ప్రవంతి ఉక్కు నగరం(విశాఖ పట్నం) ఆధ్వర్యంలో ''సవారి'' ప్రదర్శితమవుతుంది.
- 30వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ''సిరి మింగిన వెలగ పండు'' ప్రదర్శితం కానుంది.
- 30న రాత్రి 8:30 గంటలకు అభినయ ఆర్ట్స్ గుంటూరు ఆధ్వర్యంలో ''ఇంద్రప్రస్థం'' ప్రదర్శితమవుతుంది.
- 31వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు ఆధ్వర్యంలో ''కలనేత'' ప్రదర్శితం కానుంది.
- 31న రాత్రి 8:30 గంటలకు ప్రముఖ నటీమణి ఎ.విజయలక్ష్మి (విజయవాడ)కి పరుచూరి విజయలక్ష్మి స్మారక జీవితకాల పురస్కారం ప్రదానం చేస్తారు. రూ. 25 వేలు నగదు, జ్ఞాపిక అందజేయనున్నారు. నాటక పోటీల విజేతలకు ప్రముఖ సినీ దర్శకులు ఎస్.శంకర్ బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆంధ్రా హాస్పిటల్ విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నారు.

పేద ఇక రా'జాగా' : మంగళగిరి రూరల్ మండలం నిడమర్రులో సిద్ధం చేసిన లేఅవుట్



ఇన్నాళ్లూ ఒత్తులేసుకుని ఎదురుచూసిన కళ్లు వెలుగుదివ్వెలై మెరిసినట్టు.. పేదల మోములు సంతోషంతో కళకళలాడాయి. ఆనందం, ఉద్వేగం కలగలిసి ఉవ్వెత్తున ఎగసినట్టు.. పేదలంతా చెట్ట'పట్టా'లేసుకుని అమరావతి బాటపట్టారు. అంబరాన ఇంద్రధనుస్సు విరిసినట్టు.. ప్రజారాజధాని పండగ కాంతులీనింది. క్యాపిటలిస్టుల కోటలో బీదాబిక్కీ ఉండకూడదన్న దుష్టచతుష్టయం కుట్రలను ఛేదించినట్టు.. రాష్ట్ర నడిబొడ్డున బహుజన పతాక సగర్వంగా రెపరెపలాడింది. వ్యవ'స్థల'పై గెలుపుతో జననేత మాటే 'శాసన'మైనట్టు.. జనగళం జయజయధ్వానాలు పలికింది.

# పేదల చెట్ట'పట్టాల్'

- నెరవేరనున్న సొంతింటి కల
- అమరావతిలో 50,793 మందికి ఇళ్ల పట్టాలు
- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ
- శాసన రాజధానిలో పండగ వాతావరణం

**సాక్షి ప్రతినిధి, గుంటూరు:** గజం స్థలం లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్న పేదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభయమిచ్చారు. విజయవాడ నగరంతోపాటు తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని ప్రాంతాల్లోని అద్దెఇళ్లతోపాటు, చెరువు, కాలవగట్లు, కొండ అంచుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న ఎంతోమందికి శాసన రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. వాటికి సంబంధించిన పట్టాలను శుక్రవారం తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పంపిణీ చేయనున్నారు. 50,793 కుటుంబాల్లో వెలుగులు నింపనున్నారు. ఫలితంగా పేదల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు ఇప్పటికే తమకు కేటాయించిన లేఅవుట్లను సందర్శించి తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో చూసుకుని మురిసిపోయారు. గురువారం ప్రతి లేఅవుట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంక్షేమ పాలకా.. వందనం అంటూ నినదించి కృతజ్ఞత చాటారు. ఒకేసారి ఇంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం దేశచరిత్రలోనే తొలిసారి.

**సీఎం సభకు భారీగా ఏర్పాట్లు**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న పట్టాల పంపిణీ కార్యక్రమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి కావడంతో లబ్ధిదారులకు వారి కుటుంబాలకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తున్నారు. సభకు ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ మళ్లించారు. ఏర్పాట్లను మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

**సిద్ధమైన లేఅవుట్లు**

రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన లేఅవుట్లు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి. ప్లాట్ల సరిహద్దులు గుర్తించి అధికారులు రాళ్లు పాతారు. నంబరింగ్ ఇచ్చారు. తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేశారు. ఏ ప్లాటు ఎక్కడ ఉందో సూచించేలా బోర్డులను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పట్టాలను వారంక్రితమే సిద్ధం చేశారు. ఈ పట్టాలపై తహసీల్దార్‌తో సంతకాలు చేయించి అందుబాటులో పెట్టారు. వీరందరికీ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చేందుకు వాటిని స్కాన్ చేసి ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపారు. టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్లలో ఉండాల్సిన ఓపెన్ స్పేస్, రోడ్లు, డ్రెయిన్లు, పార్కింగ్, ఇతర అవసరాలకు కావాల్సిన భూమిని వదిలారు. ప్రతి లేఅవుట్‌ను డెప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో యుద్ధప్రాతిపదికన సిద్ధం చేశారు. ప్రతిరోజూ కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

**జగనన్న మా కల నిజం చేశారు**



కొన్నేళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఇన్నేళ్లకు జగనన్న సొంత ఇంటి కలను నిజం చేశారు. వెంకటపాలెంలో పట్టా అందుకోనుండడం ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బిరుదుగడ్డ మేరీ, మంగళగిరి

**ఇల్లు కట్టుకుంటాం**



మాది తూర్పుగోదావరి జిల్లా. అక్కడ పనులు లేక మేము పుట్టక ముందే మా నాన్న, అమ్మ ఇక్కడకు వలస వచ్చారు. మేము ముగ్గురం ఆడపిల్లలం. కుటుంబాన్ని పోషించడమే కష్టంగా ఉండేది. నా పెళ్లి అయిన అనంతరం నా భర్తతో కలసి ఇక్కడే ఉంటున్నాం. నా భర్త ఇస్త్రీ బండి నిర్వహిస్తుంటారు. వచ్చే డబ్బులన్నీ ఇంటి అద్దెకు, కుటుంబ ఖర్చులకే సరిపోతున్నాయి. జగనన్న స్థలం ఇచ్చారు. ఎంతో ఆనందంగా ఉంది. వెంటనే అక్కడ ఇల్లు కట్టుకుంటాం.

– కలిదిండి కృష్ణవేణి, ఉండవల్లి



వెంకటపాలెం టీటీడీ దేవస్థానంలో చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ పూజలు చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు

# మహిళల ఆర్థిక పరిపుష్టికి జగనన్న ప్రత్యేక కృషి

రాజ్యసభ సభ్యుడు
మోపిదేవి వెంకట రమణారావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

**రేపల్లె:** మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా చేయూత మార్ట్‌ను గురువారం ఆయన ప్రారంభించి అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆర్థిక స్వావలంబన కలిగిన మహిళకు కుటుంబంలో, సమాజంలో ప్రముఖ స్థానం కలిగి ఉంటుందన్నారు. మహిళల అభివృద్ధికై అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ ప్రభుత్వానిదేనన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18750 అందించి వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలు లేకుండా రుణాలు అందించటం, పొదుపులో సభ్యురాలిగా ఉండే ప్రతి మహిళ పొదుపును పెట్టుబడిగా మార్ట్‌ను ప్రారంభించటం అభినందనీయమన్నారు. మార్ట్‌ను పొదుపు మహిళలు సమష్టిగా అభివృద్ధి చేసుకుని అభివృద్ధి బాట పట్టాలని ఆకాంక్షించారు. డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిజాంపట్నంలో జనవరి నెలలో ప్రారంభించిన చేయూత మహిళా మార్ట్ లాభాలబాటలో నడుస్తోందన్నారు. ఈ ఐదు నెలల కాలంలో మార్ట్‌లో 1,06,500 రకాల వస్తువులను అమ్మకాలు జరపగా రూ.42.39లక్షల అమ్మకాలు వచ్చాయన్నారు. వీటి ద్వారా మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు కేవలం ఐదు నెలలో రూ.3.55లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి మార్టుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొదుపు మహిళలకు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావును డ్వాక్రా మహిళలు, డీఆర్‌డీఏ సిబ్బంది సత్కరించారు. తొలుత మార్ట్‌ను మోపిదేవి ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఆర్డీవో జగన్నాథం పార్థసారథి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు, తహసీల్దార్ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, డీఆర్‌డీఏ ఏపీఎం త్యాగరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో న్యాయవాది బాలయ్య మృతి

**సత్తెనపల్లి:** విద్యుత్ షాక్‌తో న్యాయవాది మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఐదు లాంతర్ల సెంటర్ సమీపంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ వెనుక వైపు నివసించే న్యాయవాది బుర్రి బాలయ్య (40) ఐదు లాంతర్ల సెంటర్‌లోని టెంట్‌హౌస్‌పైన ఇంటికి విద్యుత్ పైపు లాగుతుండగా హైవే లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తండ్రి అర్జునరావు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పలువురు న్యాయవాదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఖోఖో కేరాఫ్ పంగులూరు

పచ్చికపై కంగారుల్లా పరిగెడుతూ ప్రత్యర్థులను టచ్ చేయాలంటే పంగులూరు క్రీడాకారులకే సాధ్యం. ఎదుటివారికి దొరకుండా ఆడాలన్న వారికే సాధ్యం. ఈ గడ్డపై పుట్టిన ఎందరో జాతీయ క్రీడాకారులుగా ఎదిగారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పలువురు ఖోఖో నేర్చుకొనేందుకు పంగులూరు బాట పట్టారు.

- 31 సంవత్సరాలుగా పంగులూరులో ఖోఖో క్యాంపులు
- ఎంతో మంది క్రీడాకారులకు ఉన్నత భవిష్యత్
- గ్రామస్తులు, దాతలు, చెంచు గరటయ్య సహకారంతో..


వామప్‌చేస్తున్న క్రీడా కారులు

**జె.పంగులూరు:** పంగులూరు అంటే ఖోఖో, ఖోఖో అంటే పంగులూరు అనేలా గ్రామం ఖ్యాతి గడించింది. మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచుగరటయ్య, ఎంతో మంది దాతల సహకారంతో 31 సంవత్సరాలుగా పంగులూరులో ఖోఖోకు పేరు తీసుకొస్తున్నారు. వీటి ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

**పేదల క్రీడ**

ఖోఖో గ్రామీణ క్రీడల్లో ముఖ్యమైనది. దీని పుట్టుక మహారాష్ట్ర. దీనికి ఎలాంటి పెట్టుబడి అవసరం ఉండదు. అందుకే పేదలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. రన్నింగ్, ఛేజింగ్ అనేవి ముఖ్యమైన అంశాలు. 12 మందితోపాటు రెండు ఉడెన్ పోల్స్ ఉంటే చాలు.

**పంగులూరులో ఇలా ప్రారంభం**

1992లో మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గ్రామస్తులు, కళాశాల భవన నిర్మాణ దాత, దివంగత బాచిన వెంకట్రావు, కుటుంబ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు.

**ఖోఖో పోటీలు ఇలా..**

1994లో జె.పంగులూరు గ్రామంలో జూనియర్ బాల, బాలికల స్టేట్‌మీట్. 1996 రాష్ట్ర స్థాయి గ్రామీణ క్రీడలు ఖోఖో మీట్, 1997, 1999ల్లో సీనియర్ స్త్రీ, పురుషుల ఖోఖో స్టేట్ మీట్, 2006లో స్కూల్ గేమ్స్ అండర్ 19 స్టేట్ మీట్ , 2013లో రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల ఖోఖో పోటీలు జరిగాయి. 2008లో స్కూల్ గేమ్స్ అండర్–19 జాతీయ స్థాయి ఖోఖో చాంపియన్ షిప్ జరిగింది. 2011లో స్త్రీ, పురుషుల జాతీయ స్థాయి, 2017లో సీనియర్ సౌత్ జోన్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు పంగులూరులో జరిగాయి. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి 8 గంటల వరకు కళాశాలలో ప్రాక్టీస్ చేస్తారు. అక్కడ వ్యాయామ ఉపాధ్యాయుడు సీతారామిరెడ్డి విలువైన సలహాలు ఇస్తుంటారు.

**ఎందరికో ఉద్యోగాలు**

క్రీడా కోటాలో సీఐగా ఒకరు, ఎస్‌ఐలుగా ఏడుగురు పనిచేస్తున్నారు. కానిస్టేబుల్స్ 30 మంది సేవలందిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా 30 మంది వృత్తిలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్‌లో 20 మంది, ఆర్మీలో సుమారు 35 మంది, అమెరికాలో ఐదుగురు ఉన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఇంజినీర్లు, మెడిసిన్ చేసినవారు కూడా ఉన్నారు.

**పతకాల పంట**

అంతేకాక 1992 నుంచి 2023 వరకు సుమారు 500 మంది బాలురు, బాలికలు వ్యక్తిగత పతకాలు సాధించారు. 40 మంది బంగారు పతకాలు, 50 మంది వెండి పతకాలు, 50 మంది కాంస్య పతకాలు సాధించారు. అంతర్జాతీయంగా పలు పతకాలు సాధించారు. 1998లో భవనం కాశీవిశ్వనాథరెడ్డి, బాంగ్లాదేశ్‌లో ఆడి బంగారు పతకం సాధించాడు. 2016 పాలకీర్తి శ్రీను అసోంలోని గౌహతిలో భారత్ తరఫున, 2018లో శివారెడ్డి ఇంగ్లాడ్‌లో, 2023కి గాను 4వ ఏషియన్ గేమ్‌లో ఎ.శివనాగిరెడ్డి బంగారు పతకాలు సాధించారు.

## అంతర్జాతీయ పోటీలు నిర్వహించాలి



పంగులూరులో అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో నిర్వహించాలన్నదే నా అభిమతం. మా గ్రామంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఖోఖో ఇండియన్ ఫెడరేషన్ అధికారులు ఖోఖో నిర్వహణ చూసి ఆశ్చర్యపోయారు. వారే అంతర్జాతీయ పోటీలను పంగులూరులో నిర్వహించాలని కోరారు.

బాచిన చెంచుగరటయ్య,
చైర్మన్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్

## 31 సంవత్సరాలు



పంగులూరులో ఖోఖో క్రీడను మొదలు పెట్టి ఇప్పటికి 31 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇంతకాలం ఈ ఖోఖో నిరివ్రామంగా కొనసాగుతోంది అంటే అది గ్రామస్తుల తోడ్పాటుతోనే. డాక్టర్ బాచిన చెంచుగరటయ్య అండదండలు మరిచి పోలేం.

మేకల సీతారామిరెడ్డి,
ఏపీ రాష్ట్ర ఖోఖో కార్యదర్శి:

## పంగులూరు బ్రాండ్ ఖోఖో



పంగులూరు అంటే ఖోఖో అనేది బ్రాండ్‌గా రూపొందింది. 31 సంత్సరాల నుంచి ఖోఖో క్రీడకు మా తండ్రి బాచిన చెంచుగరటయ్య ఎంతో ప్రోత్సాహం అందించారు. అంతర్జాతీయ పోటీలు నిర్వహించేందుకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను.

బాచిన కృష్ణచైతన్య,
ఏపీ శాప్ నెట్ చైర్మన్

# సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షుడు చంద్రకుమార్

**రేపల్లె రూరల్:** ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకుమార్ కోరారు. సమస్యల పరిష్కారానికై పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటరులో గురువారం నిర్వహించిన రిలేనిరాహారదీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను కొనసాగించాలన్నారు. పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, డీఏ ఎరియర్స్ సమస్య పరిష్కరించాలన్నారు. 1వ తేదీ కల్లా జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎఫ్ ఖాతాలలో నుంచి మాయమైన డబ్బులు రీ క్రెడిట్ చేయాలని, విలేజ్ సెక్రటరీ, వార్డు సెక్రటరీలకు తొమ్మిది నెలల అరియర్స్ ఇప్పించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సెక్రటరీ రోశయ్య, నాయకులు శరత్‌బాబు, ఎల్.శ్రీనివాసరావు, ఆర్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

**తెనాలిరూరల్:** విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కఠెవరం గ్రామానికి చెందిన ఆళ్ల దామోదర్‌రెడ్డి అలియాస్ వైఎస్ విజయవాడకు చెందిన తనకు పరిచయస్తుడు నవీన్ అలియాస్ పుష్ప నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్నాడు. 50, 100 గ్రాముల ప్యాకెట్లుగా చేసి విద్యార్థులు, యువతకు విక్రయాలు జరుపుతున్నాడు. అతని వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయి కొనుగోలు చేసేందుకు దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన ఏమినేని లక్ష్మీనారాయణ బుధవారం రాత్రి తెనాలి మండలం నందివెలుగు ప్రధాన జంక్షన్‌లోని బస్టాప్ వద్దకు వచ్చి దామోదర్ రెడ్డిని కలిశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి, రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు నందివెలుగు జంక్షన్‌కు వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

ఎస్పీని కలిసిన మందకృష్ణ మాదిగ


ఎస్పీను కలిసిన మందకృష్ణ మాదిగ, బాధిత కుటుంబసభ్యులు

**బాపట్లటౌన్:** దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. బాపట్ల జిల్లా యాద్దనపూడి గ్రామంలో దళితవాడకు చెందిన మున్నంగి వీరయ్య, అగ్రవర్ణ కులానికి చెందిన జి సాంబయ్య మధ్య ప్రభుత్వ రేషన్ పంపిణీ విషయంలో జరిగిన వివాదం దాడులు, ప్రతి దాడులకు దారితీశాయన్నారు. ఈ ఘటనలో అగ్రకులానికి చెందిన వ్యక్తులు దళితులపై దాడులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు న్యాయం చేయాలంటూ గురువారం ఎస్పీ వకుల్‌జిందాల్‌ను కలిసి సమస్య వివరించారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఈ దాడిలో చట్టపరంగా న్యాయ విచారణ చేసి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. యద్దనపూడి గ్రామంలో దళితులకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక బలగాలను కేటాయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు చట్టబద్ధంగా విచారణ చేసి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ వకుల్‌జిందాల్ దాడి చేసిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షిస్తామన్నారు. యద్దనపూడి దళితులపై భవిష్యత్‌లో ఎలాంటి దాడులు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ పెంచుతామని ఎస్పీ తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ, బాపట్ల జిల్లా కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, గుంటూరు జిల్లా కన్వీనర్ కూచిపూడి సత్యం మాదిగ, గుంటూరు జిల్లా కన్వీనర్ వేమూరి సుధీర్ మాదిగ ఉన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్



**బాపట్లటౌన్** గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలో శుక్రవారం జరిగే పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు శుక్రవారం తెల్లవారుజామున నాలుగు నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లో ఉంటాయన్నారు. చెన్నై వైపు నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం, ఇబ్రహీంపట్నం, నందిగామ వైపు వెళ్లే భారీ వాహనాలు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణ సమీపంలోని త్రోవగుంట వద్ద నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం, ఇబ్రహీంపట్నం వైపుకు మళ్లించినట్లు తెలిపారు. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ళ, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్ పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లాలన్నారు. చిలకలూరిపేట నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను చిలకలూరిపేట నుంచి ఎన్‌హెచ్16 మీదగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జి మీదుగా అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు. గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బుడంపాడు మీదుగా తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి మీదగా అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించడం జరిగిందన్నారు. విశాఖపట్నం వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా మళ్లించినట్లు తెలిపారు.

# శనగల కొనుగోలు కోసం టీటీడీ పరిశీలన


శనగల కొనుగోలు కోసం ఇంకొల్లు విచ్చేసిన అధికారులు బృందం

**ఇంకొల్లు (చినగంజాం):** టీటీడీ ఆలయానికి శనగల కొనుగోలు చేసేందుకు టీటీడీ, మార్క్‌ఫెడ్, ప్రకృతి వ్యవసాయం అధికారుల బృందం గురువారం ఇంకొల్లు గ్రామానికి వచ్చారు. ఇందుకోసం టీటీడీ ఆలయం అధికారులు ఇంకొల్లులో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సేంద్రియ ఎరువులతో పండించిన సుమారు 2 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేశారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో శనగ పంటను సాగు చేసిన రైతు కాసు శ్రీనివాసరెడ్డి నుంచి శనగలను సేకరించి ఇంకొల్లు మహాలక్ష్మి దాల్‌మిల్‌లో పప్పును వేసి ఏ మేర దాని నుంచి నాణ్యమైన శనగపప్పు వస్తుందనే విషయాన్ని వారు పరిశీలించారు. అనంతరం టీటీడీ ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో సమాచారాన్ని అందిస్తామన్నారు. టీటీడీ ఆదేశానుసారం ఇంకొల్లులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న శనగలను కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చే అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం వాణిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బృందం సీఏవీఓ కే శేషశైలేంద్ర, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రమణ్యం, జనరల్ మేనేజర్ పీ మురళీకృష్ణ, ఈఈ బీ జయరాం నాయక్, మార్క్‌ఫెడ్ అధికారులు డీఎం కరుణశ్రీ, ఈఈ వెంకటాచలం, మేనేజర్ నళినీదేవి, ఏఈ శ్రీనివాస్, టీఎల్ ప్రభాకర నాయుడు, ఆర్‌పీసీ వెంకటరావు, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

# వైద్య విద్య బలోపేతానికి కృషి

**ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ప్రభావతి**

**గుంటూరు మెడికల్:** గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నీలం ప్రభావతి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను అడిషనల్ డీఎంఈ కేడర్‌లో పదోన్నతిపై వైద్య కళాశాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్ ప్రభావతి మీడియాతో మాట్లాడుతూ వైద్య కళాశాలలో పీజీలకు మెరుగైన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన డాక్టర్ ప్రభావతికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.